www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 3 అక్టోబర్ 2024
5
అన్నమయ్య

గిరిజన సాధికారతపై పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో గిరిజన సాధికారతపై కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్' పథకానికి సంబంధించి పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ శ్రీధర్ చామకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకం, గిరిజనులు, గిరిజన ప్రాంతాల సాధికారతకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ పథకంలో 17 మంత్రిత్వ శాఖల సమన్వయంతో 25 కార్యాచరణలు ఉంటాయన్నారు. గిరిజన గ్రామాలకు విద్యుదీకరణ, రహదారుల సదుపాయం, అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలన్నీ ఇందులో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన శాఖ అధికారి పి. తేజస్విని, గిరిజన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి

- రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గ్రామసభల ద్వారా ప్రజా ప్రణాళికలు రూపొందించుకొని పంచాయతీలు అన్ని రంగాలలో సమగ్రంగా అభివృద్ధి చెందాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపలి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించిన మేరకు లక్కిరెడ్డిపల్లెలో ప్రజాదర్బార్ ప్రత్యేక గ్రామసభ ప్రజా ప్రణాళిక కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సుద్దల అహల్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ గ్రామసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్దేశించిన 29 అంశాలలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను ప్రజల భాగస్వామ్యంతో రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో కలెక్టర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్మికులు, అధికారులు, ప్రజలందరూ భాగస్వాములు కావడంతో ఉత్తమ పనితీరుతో సఫారీ కర్మచారి అంశంలో మన జిల్లాకు అవార్డు రావడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా అరుదైన గౌరవం దక్కడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో సాగు, తాగునీటి సమస్య ఉందన్నారు. వెయ్యి అడుగులు బోర్ వేసిన నీరు రావడం లేదని తెలిపారు. రైతులకు పంటలు సాగు చేయడానికి నీరు లేదని చెప్పారు. ఎండిపోతున్న మామిడి తోటలకు నీరు అందించే పరిస్థితి లేదన్నారు. ఈ పరిస్థితులన్నింటిని సమర్థవంతంగా ఎదుర్కొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో తాగు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో భూములు అన్యాక్రాంతం కావడం, ట్యాంపరింగ్ జరగడం, ఆన్‌లైన్‌లో పేర్లు మార్చడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పరిపాలనలో అధికారులకు పూర్తిగా స్వేచ్ఛనిస్తున్నామన్నారు. రాబోయే కాలంలో పేద బడుగు బలహీన వర్గాలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించాలన్న విషయంలో ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ పంచాయతీలను అత్యంత సుందరంగా, స్వచ్ఛంగా చేసుకోవడం మనందరి బాధ్యతన్నారు. చెత్త నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సుద్దల అహల్య, జిల్లా, మండల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, జడ్‌పిటిలు ఎంపిటిసిలు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

- నిరసనలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఉప సంహరించుకుని ప్రభుత్వ రంగంలో ఉంచాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నిరసన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేట్ పరిశ్రమలు నష్టాల బాటలో ఉన్నాయని, రూ.10 లక్షల కోట్లు రాయితీలిచ్చారని, అదే విధంగా వైజాగ్ స్టీల్ పరిశ్రమ నష్టంలో ఉంటే నిధులు కేటాయించి ఆదుకోవాలని అన్నారు. దశల వారిగా ప్రణాళిక ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేట్ పరం చేస్తున్నాయని ప్రజలు నిరుద్యోగులు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయకుండా తొలగించిన 4 వేల మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయిటీకరించడాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ప్రయివేటీకరణ ఆపాలని 1315 రోజులుగా విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ పోరాటంసాగిస్తున్నా, ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతూ మోడీ ప్రభుత్వం ఫ్యాక్టరీని దారదత్తం చెయ్యడానికి కంకణం కట్టుకుని 'పొమ్మనకుండా పొగపెట్టే' పనులు చేస్తుందని విమర్శించారు. ప్రయివేటీకరణ నిలుపుదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. ట్రేడ్ యూనియన్లతో కూడిన అఖిలపక్ష ప్రతినిధి వర్గాన్ని ప్రధాన మంత్రి దగ్గరికి రాయబారం తీసుకు వెళ్ళాలని చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, ఉపాధ్యక్షులు సి. రవికుమార్, సిపిఐఎంఎల్ జిల్లా నాయకులు ఎం. విశ్వనాథ్, పూసపాటి రమణ, సుజాత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ ,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుదీర్ కుమార్, అధ్యక్షులు హరి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, నాగబసిరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, కోశాధికారి సలీం బాషా, సికిందర్ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సిద్ధమ్మ, అరుణ, ఇర్షాద్, కన్వీనర్ నాగేశ్వరి, నాయకులు మురళీ మోహన్ రాజు, అలీ, భాస్కర్, మాధవయ్య, నాయకులు తిరుమల, దేవా, మురళి రవి సుహాసిని పాల్గొన్నారు.

రేషన్ డీలర్లపై వేధింపులు ఆగేనా..?

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బెదిరింపులు, దాడులు తప్ప ప్రజలకు ఒరిగిందేమిలేదని జిల్లా వ్యాప్తంగా పలువురు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు మా కూటమి ప్రభుత్వంలో జరగవు.. దాడులు చేయం.. బెదిరింపులు గురిచేయం.. పార్టీలు చూడం.. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమని చెబుతున్న కూటమి ప్రభుత్వం మాటలు ఒట్టిమాటలకే తయారయ్యాయి.

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జిల్లా వ్యాప్తంగా రేషన్ డీలర్లపై జరుగుతున్న వేధింపులను ప్రభుత్వం అరికట్టాలని పలువురు రేషన్ డీలర్లు కోరుతున్నారు. రేషన్ షాపులకు రాజీనామాలు చేయాలంటూ కూటమి నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యం, నిత్యావసర సరుకులు రేషన్ షాపుల నుంచి పేదలకు సరఫరా చేస్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రస్తుతం ఉన్న రేషన్ డీలర్లు అవసరం లేదని, కూటమి నాయకులకు అనుకూలంగా ఉన్న వారికి, బినామిలకు రేషన్ షాపులను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న పలువురు రేషన్ డీలర్లను వేధిస్తూ రాజీనామాలు చేయాలంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

విజిలెన్స్ అధికారులతో దాడులు చేయిస్తాం : రేషన్ డీలర్లు రాజీనామా చేయకపోతే విజిలెన్స్ అధికారులతో దాడులు చేయించి, కేసులు పెట్టిస్తామని పలువురు కూటమి నాయకులు బెదిరింపులకు గురిచేస్తున్నారని పలువురు రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. ప్రతి నెల బియ్యం సక్రమంగా పంపిణీ చేస్తున్నా కూడా తప్పుడు లెక్కలు చూపించి కేసులు నమోదు చేయిస్తామని చెబుతుండడంతో గతిలేని పరిస్థితుల్లో రాజీనామాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిద్రమత్తులో జిల్లా యంత్రాంగం : రేషన్ డీలర్లు రాజీనామాలు చేస్తున్నా జిల్లా యంత్రాంగం ఏ మాత్రం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని రాజీనామాలు చేస్తున్న డీలర్లు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం నాయకులు బెదిరింపులు, ఒత్తిడి భరించలేక రాజీనామాలు చేస్తున్నా అసలు ఏం జరుగుతుందని ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం దురదృష్టకరం. ఏది ఏమైనప్పటికీ ఎన్నో ఏళ్లుగా రేషన్ షాపులు నడుపుతున్న వారిని బెదిరింపులకు గురి చేసి రాజీనామాలు చేయిస్తుండడంపై జిల్లా యంత్రాంగం స్పందించి, దాడులకు, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లాలోని పలువురు రేషన్ డీలర్లు కోరుతున్నారు.

రాజీనామాలు చేయాలంటూ అధికార పార్టీ నేతల ఒత్తిడి
విజిలెన్స్ అధికారులతో దాడులు చేయిస్తామంటూ బెదిరింపులు

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

- సత్యాగ్రహ దీక్షలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్

గాంధీ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ జయంతిని పురస్కరించుకొని సత్యాగ్రహ దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్నా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, మున్సిపల్ టీచర్లకు వర్తించడం లేదన్నారు.మున్సిపల్ హైస్కూల్స్‌లో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో 3, 4, 5వ తరగతులను విలీనం చేశారే తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్లు, బదిలీలు జరగడం లేదని, అర్బన్ ఎంఇఒ పోస్టులు ఇవ్వడం లేదని తెలిపారు. పిఎఫ్ ఖాతాలు నిరుపయోగంగా ఉన్నాయనిమ తెలిపారు. జీతాల నుండి మినహాయించే సొమ్ము వారి అవసరాలకు వినియోగించు కునేందుకు అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. మున్సిపల్ టీచర్ల ఆందోళన రోజు రోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు టి.సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, డివిజన్ కన్వీనర్ సుధాకర్, పట్టణ అధ్యక్షులు గాలి రవీంద్ర, ఈశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని యుటిఎఫ్ ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. మహాత్మ గాంధీ చూపిన అహింస మార్గంలో అందరూ పయనించాలని నాయకులు పిలుపునిచ్చారు.

గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- గాంధీ విగ్రహానికి వినతి పత్రం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని కోరుతూ బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మురళీమోహన్ రాజు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా సమగ్ర శిక్ష ఉద్యోగుల బతుకులు మారడం లేదని స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కిల్ వర్కర్స్, స్కీమ్ వర్కర్స్, పార్ట్ టైం ఇన్స్ట్రక్చర్స్ అనే రకరకాల పేర్లతో ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని అనేకసార్లు నాయకులు అధికారులతో మొరపెట్టుకున్న ప్రయోజనం లేకుండా పోతుందని అన్నారు. ఇప్పటికైనా సమగ్ర శిక్ష ఉద్యోగులకు పర్మినెంట్ చేసి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇపిఎఫ్ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామానుజులు, ఉపాధ్యక్షులు సి రవికుమార్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం కార్యదర్శి షేక్ అలీ హుస్సేన్, సభ్యులు ప్రదీప్ కుమార్, రెడ్డి లక్ష్మి, సాబీరున్, సమియున్ పాల్గొన్నారు.

అహింసా మార్గాన్ని నిర్దేశించిన 'మహాత్మ' : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

మహాత్మా గాంధీ ప్రపంచంలోని ప్రతి దేశానికి అహింసా మార్గాన్ని నిర్దేశించిన మహా నాయకుడని, ఆయన్ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్మా గాంధీ అనుసరించిన అహింస, సత్యం, సత్యాగ్రహ మార్గాలతో శాంతి అహింసలను చాటిన మహనీయుడు అన్నారు. మహాత్మా గాంధీ చూపించిన బాటలోనే ప్రజలందరూ నడవాలని, అహింసను, సత్యమార్గాన్ని జీవితంలో అవలంబించాలని సూచించారు. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని గ్రామ స్వరాజ్యమే దేశ అభివృద్ధికి మూల కారణమని మహాత్ముడు చాటాడన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లా అధికారులు, డాక్టర్ విద్యాధర్, నాయకులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి

కార్మికులకు దుస్తులు, పాదరక్షలు అందజేస్తున్న మంత్రి మండిపల్లి

పారిశుధ్య కార్యక్రమాలలో పనిచేస్తున్న కార్మికులను జాతిపిత మహాత్మా గాంధీ స్పూర్తిగా గౌరవించడం అదృష్టంగా భావిస్తున్నానని రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పిసిఆర్ కన్వెన్షన్ హాల్‌లో మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రి చేతుల మీదుగా 250 మంది మున్సిపల్ కార్మికులకు వస్త్రాలు, పాదరక్షల పంపిణీ చేశారు. మంత్రి స్వంత నిధులతో రాయచోటి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఒక జత బట్టలు, ఒక జత చెప్పులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహాత్మా గాంధీ సిద్ధాంతం అహింస, స్వచ్ఛత ఎక్కడైతే స్వచ్ఛత ఉంటుందో అక్కడ పరిసరాలని శుభ్రంగా ఉండి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని కోరారు. తమ తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా నేడు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతలో పాలుపంచుకునే కార్మికులను గౌరవించడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రాయచోటి పరిధిలోని మునిసిపల్ కార్మికులకు 3 సెంట్లు స్థలం ఇప్పించి, ఇళ్లు కట్టించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే నగరం విస్తీర్ణం అవుతున్నందున అదనపు కార్మికుల నియామకానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్మికుల కుటుంబాలలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే తన స్వంత నిధులు, లేదా ముఖ్యమంత్రి నిధుల నుంచి ఆర్థికపరమైన సాయం అందించి ఆదుకుంటామని పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఉత్తమ పనితీరుతో మంచి కార్యక్రమాలు నిర్వహించినందుకు గ్రామీణ విభాగంలో సఫాయి మిత్ర సురక్ష కాంపోనెంటులో అన్నమయ్య జిల్లా ఉత్తమ అవార్డు అందుకోవడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో స్వచ్ఛత కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేసి అన్నమయ్య జిల్లాలో పరిశుభ్రంగా వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు తమ ట్రస్టు ద్వారా మంత్రి సొంత నిధులతో ఒక జత వస్త్రాలు పాదరక్షలు పంపిణీ చేశారు. విజయవాడ బుడమేరు వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా నుంచి వెళ్లిన మున్సిపల్ కమిషనర్, పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా శాలువా, మెమెంటో ప్రశంస పత్రాన్ని మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదరవల్లి, డాక్టర్ విద్యాధర్, వివిధ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు మోసగాళ్ల అరెస్టు

రూ.2 కోట్ల విలువైన 37 కార్లు స్వాధీనం
కడప జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

తమకు జిల్లా స్థాయిలో ప్రభుత్వ అధికారులు పరిచయమని, నెలకు రూ. 30 వేలు కారుకు అద్దె చెల్లిస్తానంటూ కొద్ది నెలలు అద్దె చెల్లించి, కార్లు తిరిగి ఇవ్వకుండా, కార్లకు అద్దె చెల్లించకుండా ఉంటూ మోసం చేసిన నబీకోటకు చెందిన నిమ్మకాయల వెంకట శశిధర్ రెడ్డి (38),షేక్. జిలాని (21) ని నబికోట శివాలయం వద్ద అరెస్టు చేసి రూ.2 కోట్ల విలువైన వివిధ కంపెనీల కార్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మూడు కార్లు అద్దెకు తీసుకుని మొదటి రెండు నెలలు అద్దె చెల్లించి తరువాత అద్దె చెల్లించకుండా, కార్లు ఇవ్వకుండా మోసం చేశారేని సెప్టెంబర్ 25న కడప తాలూకా పిఎస్‌లో కడప నగరం నబీకోటకు చెందిన బాధితుడు దిన్నె వీరేందర్ ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. అద్దె పేరిట మరో 34 కార్లను తీసుకుని యజమానులను మోసం చేసి కుదువ పెట్టినట్లు విచారణలో పోలీసులు గుర్తించారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ వ్యక్తుల వద్ద రూ.47 లక్షలకు కుదువ పెట్టిన మొత్తం రూ.2 కోట్ల విలువైన 37 కార్లను తాలూకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అతి తక్కువ సమయంలో కేసు ఛేదించి నిందితులను అరెస్టు చేయడంతో పాటు కార్లను రికవరీ చేసిన కడప ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఎస్.రమాకాంత్ పర్యవేక్షణలో కడప తాలూకా సిఐ జి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ డి.తాహిర్ హుస్సేన్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్‌లు శేఖర్, విద్యాసాగర్, కానిస్టేబుళ్లు రమేష్, సునీల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా కెవిపిఎస్ 26వ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం సంఘం జిల్లా అధ్యక్షులు డి.సి.వెంకటయ్య ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న కుల వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. కుల వివక్ష మన రాష్ట్రంలో చాప కింద నీరు లాగా కొనసాగుతుందని దేశానికి స్వాతం త్ర్యం వచ్చినా ఇప్పటికీ దళితులపై అవమానాలు, అంటరానితనం, దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయని 1998లో కుల నిర్మూలన పోరాట లక్ష్యంతో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఏర్పడిందని పేర్కొన్నారు. దళితుల వైపు నిలబడి రాజీలేని పోరాటాలు చేసి ఏకసభ్య కమిషన్, జస్టిస్ పున్నయ్య కమిషన్, శ్మశానాలు, సమస్యల పరిష్కారం కోసం జీవో తీసుకొచ్చి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని సబ్ ప్లాన్ చట్టాన్ని సాధించామని అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను అంతమొందించడానికి ఐక్య పోరాటాలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ సభ్యులు లక్ష్మయ్య, వెంకటయ్య, తులసీనాథ్, అంజమ్మ, అనురాధ, చిన్నకృష్ణ కుమార్, రఘునాథ పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ జిల్లా జట్టు కెప్టెన్‌గా హితేష్ సాయి

ప్రజాశక్తి - కడప

అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా పి.హితేష్ సాయి వ్యవహరించనున్నారు. ఈనెల 4నుంచి నుండి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలోని వై.ఎస్. రాజారెడ్డి స్టేడియం, కెఎస్ఆర్ ఎం, కెఒఆర్ ఎం క్రికెట్ మైదానాలలో నిర్వహించే అండర్- 14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని కడప జిల్లా జట్టును బుధవారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్ ప్రకటించారు. కడప జిల్లా అండర్ 14 జట్టు కెప్టెన్ గా పి. హితేష్ సాయి వ్యవహరిస్తారు. జట్టు సభ్యులుగా సి. వి. ఎస్. ప్రసాద్, జి. సూర్యతేజారెడ్డి, ఏ. అభ్వినివేష్ రెడ్డి, ఎం. జగదీశ్వర్‌రెడ్డి, కె. లోకేష్, ఎస్‌ఎండి. తాహిర్, జెపి. ఖలీద్, ఆర్. యోగాంజనేయులు, ఎస్. ఎమ్. డి. ఫైజాన్, ఆర్.పి. ఇమ్మానియేల్, బి. సాయి కృష్ణ, చైతన్య పి. అస్జెడ్ అలీ ఖాన్, బి. ముని జ్ఞానేశ్వర్ రెడ్డి, జి. ఆదిత్య, జి. మానస్ నందన్, పి. అస్కాన్ ఖాన్, ఏ. చెన్నకేశవ వ్యవహరిస్తారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి ప్రసాద్ తెలిపారు. స్టాండ్ బైలుగా వి. రామ్ చరణ్, యు. శివ చరణ్, ఎస్. భాను వర్షిత్ రెడ్డి, ఎస్ఎండి. ఉమర్ సిద్ధిక్, జి. భవిత్ రెడ్డి, ఎం. వర్షిత్ కుమార్, వి. శరణ్య రెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా జట్టు కోచ్‌గా అబూబకర్ వ్యవహరిస్తారని అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి ప్రసాద్ తెలిపారు.

కలుషిత నీరు తాగి 25 మందికి అస్వస్థత

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణంలోని కన్నెలూరు, నేతాజీనగర్‌లో కలుషిత నీరు తాగి 25 మంది అస్వస్థతకు గురయ్యారు. వివరాలలోకి వెళితే. మంగళవారం రాత్రి ప్రజలు కలుషితమైన నీరు తాగడంతో పలువురికి బుధవారం ఉదయం నుంచి కళ్లు తిరగడం, వాంతులు, విరేచనాలు అయ్యాయి. అస్వస్థతకు గురైన వారి స్థానిక క్యాంబెల్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రయివేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. కొద్దిరోజులుగా తాగునీరు మురికిగా, వాసనతో వస్తున్నట్లు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కలుషిత నీటిని తాగి అస్వస్థతకు గురయ్యారని స్థానికులు పేర్కొన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, సిఐ, ఎస్ఐ, అధికారులు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సంఘటనపై కమిషనర్ వెంకటరామిరెడ్డి స్పందిస్తూ ప్రజలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురవ్వగానే నేతాజీనగర్, కన్నెలూరుకు నీటి సరఫరా నిలిపేసి, ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నామని చెప్పారు. నీటి సాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపి కారణాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఫోన్ ద్వారా స్పందిస్తూ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి : పట్టణంలో కన్నెలూరు, నేతాజీ నగర్ కాలనీలలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం వారు జమ్మలమడుగులో విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజులుగా నీరు దుర్వాసన వస్తోందన్నారు. అధికారులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ, సిబ్బంది

ప్లాస్టిక్ పర్యావరణానికి హాని : ఎంపిడిఒ

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్లాస్టిక్ పర్యావరణానికి హాని అని ఎంపిడిఒ దివ్య పేర్కొన్నారు. గాంధీ జయంతి, స్వచ్ఛ భారత్ దివస్ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సమావేశంలో 'ప్లాస్టిక్ కవర్లు మానండి-బట్ట సంచులు వాడండి' అనే నినాదంలో ప్రజలు, హోటళ్లు, దుకాణ దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ 50 మైక్రాన్ల కంటే తక్కువ ప్లాస్టిక్ సంచుల స్థానంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి కోసం బయోడిగ్రేడబుల్ కంపోస్ట్ సంచుల వాడకం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నజీర్, ప్రజలు, అధికారులు, దుకాణదారులు పాల్గొన్నారు.

సెలవులకు ఊరికి వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోండి :సిఐ

ప్రజాశక్తి-కలికిరి

దసరా పండుగకు ఊరు వెళ్తుంటే జాగ్రత్తగా ఉండాలని సిఐ రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు పోలీసు శాఖ వారు మండల ప్రజలను హెచ్చరించారు. పండగకు ఊరు వెళ్తున్న వారు ఇంట్లో ఉన్న బంగారు, నగదును లాకర్‌లో పెట్టుకోవాలని సూచించారు. ఖరీదైన వస్తువులు తమ వెంట ఊరు వెళ్తున్నప్పుడు తీసుకెళ్లాలని తెలిపారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వాళ్లకు సమాచారం అందించి ఇంటివైపు చూస్తూ ఉండాలని కోరాలని తెలిపారు. తమ వీధుల్లో గాని, కాలనీలో గాని అనుమానపు వ్యక్తులు ఎవరైనా తిరుగుతుంటే సంబంధిత పోలీసు శాఖ వారికి తెలపాలని,లేదా డయల్ 100 కి ఫోన్ చేసి తెలపాలని ప్రజలకు సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి :ఎస్ఐ

ప్రజాశక్తి-పుల్లంపేట

మాట్లాడుతున్న ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మోహన్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డబ్బులు ఎవరికి ఊరికే రావు అన్న విషయాన్ని గుర్తించి మీ కష్టార్జితం సైబర్ నేరస్తుల పాలు చేసుకోవద్దని, అపరిచిత వెబ్ సైట్, ఎపికె ఫైల్స్ క్లిక్ చేయవద్దని సూచించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు గురించి అవగాహన కలిగి ఉంటే చాలా వరకు నేరాలను తగ్గించవచ్చునన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయడం ద్వారా లేదా సైబర్ క్రైమ్ వెబ్ సైట్స్ ద్వారా ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్ము చాలావరకు తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. వీరు మొదట ఉచితంగా చిన్నచిన్న టాస్కులు నిర్వహించి గెలిచిన సొమ్ము ఖాతాలలో జమ చేస్తారని, ఆ తర్వాత తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెట్టించి రెండింతలు, మూడింతలు అధిక ఆదా యం ఇచ్చి ఆశ చూపుతారని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మాయలో పడి ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టినప్పుడు వాటిని ఇవ్వకుండా మోసం చేస్తారని పేర్కొన్నారు. ప్రతి వారంలో ఒకరోజు లేదా గురువారం మాత్రమే అకౌంట్లోకి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని నిబంధన విధిస్తారని చెప్పారు. అప్పటివరకు వివిధ కారణాలు చెబుతూ అధిక మొత్తంలో డబ్బులు పెట్టుబడిగా పెట్టించి సైబర్ నేరగాళ్ల వెబ్ సైట్‌లో ఉన్న అకౌంట్లో ఆ డబ్బులు అధికం అవుతున్నట్లు చూపుతారని తెలిపారు. తీరా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకునే రోజు వచ్చేసరికి మీ బ్యాంకు అకౌంట్‌కు డబ్బులు జమ కావని, అవి కేవలం వారి సైట్‌లోకనిపించే డబ్బులు మాత్రమేనని తెలుపుతారని అన్నారు. మోసపోయామని గ్రహించే లోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుందని అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా మండల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్ఐ సూచించారు.ప్రజలకు ఎటువంటి సహకారం కావాలన్నా అందుబాటులో ఉంటామని తెలిపారు.

మాట్లాడుతున్న సర్పంచ్ నాగార్జున చారి

మట్లి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-వీరబల్లి

గ్రామ ప్రజల సహకారంతో మట్లి పంచాయతీని జిల్లాలో ఆదర్శ గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దుతానని సర్పంచ్ సోమారపు నాగార్జున ఆచారి అన్నారు. మండలంలోని మట్లి పంచాయతీ సచివాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున ఆచారి మాట్లాడుతూ పార్టీలకు అతీ తంగా కుల మతాలకతీతంగా ప్రజా సమస్యలు పరిష్కరించడం ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, గ్రామంలో త్రాగునీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్, రోడ్లు, డ్రైయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు వినియోగించి సిమెంట్ రోడ్లు, తాగునీటి విషయాలపై చర్చించారు. సమా వేశంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, ఎపిఒ నాగరాజు మాట్లాడుతూ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, పంచాయితీలలో జరుగుతున్న ఇతర అభివృద్ధి ప్రణాళికలు,గ్రామపంచాయతీ పరిపాలన, సమస్యల గురించి చర్చించారు. ఉపాధి హామీ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో సిమెంట్ రోడ్లు తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలు ఐకమత్యంతో గ్రామాభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, ఎపిఒ నాగరాజా, పంచాయతీ కార్యదర్శి వం ప్రసాద్ టిడిపి నాయకులు నాగభూషణ నాయుడు, చంద్రబాబు నాయుడు, చేనేత అధ్యక్షులు పుల్లగూర ధర్మయ్య, చెన్నకేశవులు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ వార్డు మెంబర్లు ప్రజలు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండలంలోని బాగంపల్లె గ్రామపంచాయతీ గ్రామ సచివాల యంలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి ఉపాధి పనులపై సమీక్ష చేసినట్లు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ రాజేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షట్ డౌన్ లోడ్ తీయడం, రోడ్డు పనులు, వ్యవసాయ భూముల్లో గట్లు వేయడం, డ్రైయినేజీ కాలువలు ఏర్పాటు చేయడం వంటి పనులకు గ్రామసభలో ప్రతి పాదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ రామ్మోహన్‌రెడ్డి సచివాలయం కంప్యూటర్ ఆపరేటర్ శివ, అసిస్టెంట్ ఇంజినీర్ పాల్గొన్నారు.

30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్: దసరా కానుకగా 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం శాంతినికేతన్ హై స్కూల్ లో ఉమ్మడి జిల్లా ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక హక్కులను హరించిన గత ప్రభుత్వాన్ని వీడి ఐక్యమత్యంతో కూటమి ప్రభుత్వాన్ని, చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించారని పేర్కొన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలతో సమావేశం నిర్వహించి రావలసిన రూ.20 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ 3వ తరగతి నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండాల్సిందేనని, అలా తీసివేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.సి. రెడ్డన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో 11వ పిఆర్‌సిని కమిటీని ప్రకటించాలన్నారు.. కార్యక్రమంలో వైఎస్ఆర్ అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్ను పల్లె ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

గాంధీజీ జీవితం స్ఫూర్తి దాయకం

మదనపల్లి: గాంధీజీ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహాత్ముడి ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దామని ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్‌బాషా పిలుపు నిచ్చారు. బుధవారం జాతిపిత మహాత్మ జయంతిని పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ వి.మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్లు షేక్ షబానా, కొండుపల్లి ప్రసాద్ బాబు, కరీముల్లా, రేణుకమ్మ, సుగుణ ఆంజనేయులు,కో -ఆప్షన్ మెంబర్ శారద రెడ్డి, ఖాజా హుస్సేన్ టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యం, అహింస మార్గాల ద్వారా ఏదైనా సాధించవచ్చునని గాంధీజీ నిరూపించారన్నారు. స్వచ్ఛమైన భారతదేశాన్ని చూడాల న్నదే ఆయన లక్ష్యమని అన్నారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులను పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. **సబ్‌జైలులో :** స్థానిక సబ్ జైల్లోని రిమాండ్ ఖైదీలను ఎమ్మెల్యే పలకరిం చారు. వారికి పండ్లు పంపిణీ చేసి గాంధీ జయంతి విశిష్టతను తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షణికావేశంలోనో, తెలిసో తెలియకో చేసిన చిన్న పొరపాట్లకు ఇక్కడ ఎంతో మంది శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. మారుమనస్సు పొంది మరో సారి ఇలాంటి తప్పు పునరావృతం కాకుండా జీవనాన్ని కొనసాగించాలని సూచించారు కార్యక్రమంలో జైలర్‌తో పాటు సిబ్బంది, టిడిపి నాయకులు ఎస్ఎ మస్తాన్, రఘుపతి నాయుడు, పూలకుంట్ల హరిబాబు పాల్గొన్నారు. **కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో..** గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు కార్యక్రమ ంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ముబారక్ ఖాన్, ఖాదర్‌బాషా, మీనాకుమారి, డాక్టర్ ఎస్.కె. బాషా, రవీంద్ర, సోమశేఖర్, ఈశ్వరమ్మ, శరత్ కుమార్ రెడ్డి, మహమ్మద్ అలీ పాల్గొన్నారు. **జ్ఞానాంబిక ఆధ్వర్యంలో..** విద్యార్థులు గాంధీ మార్గంలో పయనిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని జ్ఞానాంబిక ప్రిన్సిపల్ సురభి రమాదేవి పేర్కొన్నారు. గాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** స్థానిక మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో 155 వ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఇఒ గురుప్రసాద్, సర్పంచ్ ఎల్లయ్య, ఇఒఆర్‌డి పరశురాం ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మరికుంట పల్లి గ్రామ పంచాయతీ నందు సర్పంచ్ రెడ్డి రామ్, పంచాయతీ కార్యదర్శి గాయత్రి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మేడికుర్తి గ్రామ పంచాయతీలో సర్పంచ్ సిద్ధప్ప గారి నాగవేణి కార్యదర్శి మయూరి ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కురబా చైర్మన్ జనార్ధన్‌గౌడ్, గ్రామ వైస్ సర్పంచ్ ప్రహల్లాదయాదవ్, నాయకులు రాఘవేంద్ర యాదవ్, పూర్ణచంద్ర యాదవ్, సూరి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. **పీలేరు:** సమాజంలోని ప్రతి పౌరుడు మహాత్ముని ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ తెలిపారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని న్యాయమూర్తి పీలేరు ఉప కార్యాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి పౌరుడూ, ఖైదీ జాతిపిత అడుగు జాడల్లో నడవాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నేటి బాలలకు తెలియ జేయాలని అన్నారు. మహాత్ముని జయంతిని పురస్కరిం చుకొని ఆయన సందేశాలు, సూక్తులను నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎందరో గుర్తుకు చేసుకుంటున్నారని చెప్పారు. అనంతరం సబ్ జైలు పరిసరాలు, వంటగది పరిశీలిం చారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, న్యాయవాది షౌకత్‌అలీ, పీలేరు ఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు. **రాయచోటి :**గాంధీ చూపిన సత్యం, ధర్మం, అహింసా మార్గాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని వైసిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కార్యాలయం లో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, జడ్‌పిటిసి వెంకటేశ్వర కౌన్సిలర్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్ బాషా, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, గౌస్‌ఖాన్, జానం రవీంద్ర యాదవ్, రియాజ్, సుగవాసి శ్యామ్, కో-ఆప్షన్ సభ్యురాలు మైమూన్,వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, అబుజర్, గౌస్, యువజన విభాగపు అధ్యక్షుడు కొత్తపల్లె ఇంతియాజ్, జయచంద్రారెడ్డి, ఖలీల్, జగదీష్, యూసుబ్, గువ్వల జగదీష్ పాల్గొన్నారు. **వ రాజంపేట అర్బన్ :** జాతిపిత మహాత్మా గాంధీ ప్రపంచంలోని ప్రతి దేశానికి అహింసా మార్గాన్ని నిర్దేశించిన మహా నాయకుడని, ఆయనను అనుసరించి ప్రతిఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలని గౌరవ అధ్యక్షులు ఇండ్లూరి వెంకటరెడ్డి, రాజంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బచ్చోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి మందాశివయ్య అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఓబులేసు,శివయ్య నాయుడు, కోశాధికారి సునీల్, కార్య నిర్వాహక కార్యదర్శులు జివిపిఆర్‌కె రాయలు, శ్రీహరి, నరసింహ, చామంచి వెంకట సుబ్బయ్య, దుర్గయ్య, మధుసూదన్ పాల్గొన్నారు. **పుల్లంపేట :** పుల్లంపేట మండల పరిధిలోని ఎంఆర్‌సిలో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఎంఇఒ చక్రధర్‌రాజు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో ఎస్‌టియు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నరేంద్రనాథ్, ఎస్‌బివిడి సభ హైస్కూల్ హెచ్‌ఎం మురళి, జడ్‌పిహెచ్‌ఎస్ కొత్తపేట ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, సంస్కృత పాఠశాల హెచ్‌ఎం వరదారెడ్డి, మహేష్, మురళీధర్, శంకరయ్య, రమణ మూర్తి, రామ్మోహన్ పాల్గొన్నారు. **వీరబల్లి:** ప్రపంచ దేశాలకు అహింసా మార్గాన్ని నేర్పిన మహానుభావుడు మహాత్మా గాంధీ అని సర్పంచ్ నాగార్జున చారి కొనియాడారు. మండలంలోని 12 పంచాయతీ సచివాల యంలో ఘనంగా మహాత్మ గాంధీ జయంతి వేడుకలు జరుపుకున్నారు. అధికారులు గాంధీ చిత్రప టానికి పూల మాలవేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో ఎంపిడిఒమల్లేశ్వరి, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, ఎపిఒ నాగరాజా, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** స్థానిక నగర పంచాయతీ కార్యలయంలో బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను కమిషనర్ పల్లవి ఆధ్వర్యంలో ఘనంగా జరుపున్నారు. గాంధీజీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పారిశుధ్య కార్మికులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ర్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది, పారిశుధ్యకా ర్మికులు కార్మికులు పాల్గొన్నారు. **వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..**మహనీయుల త్యాగాలు మరువలేనివని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జాతిపిత మహాత్మగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలను వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకు న్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ బస్టాండ్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభు త్వాసుపత్రిలో సూపరింటెండెంట్ ఫైరోజా బేగం, జర్రా వారిపల్లెలో సర్పంచ్ మునిభాస్కర గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, రమేష్, చంద్రమౌళి, విభాకర్ రెడ్డి, చంద్రశేఖర్, శంకర, గోపాల్, రెడ్డిరాము, ఆదినారాయణ, మురళి, ఆనంద, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** స్వాతంత్ర పోరాట యోధుడు జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు నెరవేర్చేందుకు అందరూ కృషి చేయాలని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య కోరారు. గాంధీ జయంతి సందర్భంగా ఆస్పత్రిలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూజలు చేసి పుష్పాంజలి ఘటించారు. ఘన నివాళులు అర్పించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ ఆనంద్ కుమార్, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్‌లు గాంధీ చిత్ర పటా నికి పూజలతో ఘనంగా నివాళులర్పించారు. మహా త్మా గాంధీ కన్న కలలు గ్రామ స్వరాజ్యం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమాలలో డాక్టర్ అమరకు మ్మరాజు, వైద్య సిబ్బంది, సర్పంచులు, పంచాయతీ కార్యద ర్శులు, సచివాలయ ఉద్యోగులు, పజలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లి: గాంధీజీ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం : గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

బి.కొత్తకోట : సన్మానం పొందిన పారిశుధ్య కార్మికులతో కమిషనర్

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం నిమ్మనపల్లె పంచాయతీ పెద్దరాజుల పల్లె, తవళం పంచాయతీ ఉంటావారిపల్లెలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సర్పంచులు పాపులమ్మ మల్లప్ప, రెడ్డప్ప లతో కలసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళుతున్నాదని, అదే లక్ష్యంతో మదనపల్లె నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ తాగునీరు, సిమెంటు రోడ్లు, మురుగనీటి కాలువలను ఏర్పాటు చేస్తామని అన్నారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ నిధుల ద్వారా 40 ప్రాంతాలలో సుమారు రూ.1.50 కోట్లతో 3,750 మీటర్ల పొడవైన సిమెంటు రోడ్డు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. నిమ్మనపల్లె పంచాయితీలో 35 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు పనులను చేపడుతుండగా, తవళం పంచాయతీ ఉంటావారిపల్లెలో 12 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని అన్నారు. ప్రతి గ్రామానికి ప్రజలు రాకపోకలు సాగించటానికి రోడ్డు నిర్మాణ పనులను చేపడతామని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నెరవేరు స్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా కూడా అభివృద్ధి పనులు చేపట్టిన ధాఖలాలు లేవన్నారు. త్వరలో మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లను ప్రభుత్వం అందించబోతున్నాదని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎప్పుడు ఇలాగే ఉండాలని కోరారు. ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ప్రజలలో అంధత్వ నిర్మూలనకు కృషి చేయాలని కోరుతూ, ప్రస్తుతం వారు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పుర్ర వెంకటరమణ, మాజీ మండల అధ్యక్షులు రాజన్న, జనసేన మండల ఉపాధ్యక్షులు ఈతకట్ట చంద్రశేఖర్, బాబిరెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సుధాకర్ రావు, శ్రీపతి, చినబాబు, లక్ష్మన్న, విజయ్, చంద్రాయుడు, నారాయణ, రెడ్డప్ప, మాజీ ఎంపిటిసి నాగరాజ నాయుడు, మండల స్పెషల్ ఆఫీసర్ ప్రసాద్, ఎంపిడిఒ రమేష్ బాబు, పిఆర్ డిఇఇ శివశంకర్, ఏపీఒ రమేష్, ఎఇ తిరుమలేష్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం

మదనపల్లె అర్బన్

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని కరాటే గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎఆర్.సురేష్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం కడప శాఖ, మదనపల్లి యూత్ కరాటే క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించు కొని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా యువత, విద్యార్థులు కలిసి మదనపల్లి వన్ టౌన్, తాలూకా పోలీసు స్టేషన్ ఆవరణంలో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మిట్స్ అభినయ్ కాంత్, టిబి కౌన్సిలర్ ప్రభాకర్, వనజ కుమారి, పిఇటి నరేష్, కృష్ణమూర్తి, కరాటే విద్యార్థులు మహేశ్వర్, మొహమ్మద్ ఐమాన్, మోహిబుల్ రెహ్మాన్, కాలేషా మస్తాన్, మహమ్మద్ ఉమర్, పోలీసు సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : గ్రామాలలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతను కల్పిస్తున్నట్లు నిమ్మనపల్లి సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, అగ్రహారం సర్పంచ్ ఉషారాణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని పంచాయతీలలో ఎంపిడిఒ రమేష్‌బాబు, ఇఒపిఆర్‌డి చలపతిరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కలసి జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛత హి సేవ పై గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలకు పారిశుధ్యం పై అవగాహన కల్పించారు. పట్టణాల తరహాలో గ్రామాల లోను ఇంటింటా చెత్తను సేకరించడానికి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను విరివిగా చేపట్టాలని ఆదేశించిందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టవలసిన పనులను గుర్తించి ప్రణాళికలను రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రమేష్, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, రాజేష్, గ్రామ ప్రత్యేక ఆహ్వానితులు మల్లప్ప, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మదనపల్లి : స్వచ్ఛతా హి సేవాలో కరాటే క్లబ్ సభ్యులు

ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి-పీలేరు

ఒకరి రక్తదానం మరెందరికో ప్రాణదానం అవుతుందని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ లయన్సుక్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటుందని, అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వాసుపత్రి సహకారంతో ఏర్పాటు చేశారన్నారని తెలిపారు. ఈ లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఆరోగ్యవవంతులైన ప్రతి ఒక్కరూ రక్తం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ఎంతో మంది సరైన సమయానికి అవసరమైన రక్త గ్రూపు దొరక ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. 18 సంవత్సరాలు నిండి న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని అన్నారు. గర్భిణులకు కాన్పు సమయంలో రక్త కొరతతో ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. రోడ్డు ప్రమాదాలో గాయపడిన వారు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు రక్త కొరతతో ప్రాణాలను కాపాడుకోలేక పోతున్నారని అన్నారు. అటువంటి వారిని దృష్టిలో ఉంచుకొని రక్తదాం చేయాలని కోరారు. కార్యక్రమంలో మునాఫ్, లయన్సు క్లబ్ అధ్యక్షులు పామిడి మహేష్ గుప్త, ఉపాధ్యక్షులు నాగబాలాజీ, కార్యదర్శి విజయభాస్కర్రెడ్డి, కోశాధికారి చెంగయ్య, సభ్యులు అరవింద్, శ్రీనివాసులురెడ్డి, అశోక్, మహేష్, షిరిడి కలర్ ల్యాబ్ మధు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు


ఫర్నీచర్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

నాణ్యమైన సామగ్రి అందించండి :'మండిపల్లి'

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు మండల కేంద్రం నందలి ఎ-వన్ ఎంటర్ప్రైజెస్ ఫర్నిచర్ షాప్ దినదినాభివృద్ధి చెందుతూ వినియోగదారులకు సరసమైన ధరలకు వస్తువులను అందించాలని రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి. రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గాలివీడు మండల కేంద్రంలో నూత నంగా ఏర్పాటు చేసిన ఎ-వన్ ఎంటర్ప్రైజెస్ ఫర్నిచర్ షాపును మంత్రి, టిడిపి నాయకులు లక్ష్మీప్రసాద్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణంలో ఏర్పాటు చేసిన వస్తువులను, వాటి వివరాలను ఫర్నిచర్ షాప్ యజమానులు మంత్రికి వివరించారు. నూతనంగా ఫర్నిచర్ షాప్‌ను ఏర్పాటు చేయడంతో యాజమాన్యానికి మంత్రి శుభాభినందనలు తెలిపారు. షాపు నందలి వస్తువులను సరసమైన ధరలక అందించి దినదినాభివృద్ధి చెందాలని, వ్యాపారంలో వారు మరింత ఉన్నత శిఖరాలను అందుకో వాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహమ్మద్ రియాజ్, శ్రీకాంత్‌రెడ్డి, లక్షుమయ్య, హేమకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

6న చలో రాయచోటి

ప్రజాశక్తి - రామసముద్రం

రాయచోటి పట్టణంలో ఆరవ తేదీ నిర్వహించే ఎస్‌సి వర్గీకరణ, ఎస్‌సి, ఎస్‌టిల పట్ల క్రిమిలేయర్ వ్యతిరేక సభలను జయప్రదం చేయాలని మండల మాలమహానాడు అధ్యక్షులు కృష్ణప్ప పిలుపునిచ్చారు. హలో మాల చలో రాయ చోటి సమావేశానికి మండల మాలలు అందరూ పాల్గొని విజవంతం చేయవలసిందిగా కోరారు.కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి సభ్యులు శివశంకర, శేషు, గోపాల్, చంద్ర, చంద్ర హాసన్‌పాల్గొన్నారు.

ఘనంగా విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - రామసముద్రం : మండల టిడిపి అధ్యక్షులు జి.విజయ్ కుమార్‌గౌడ్ పుట్టినరోజు వేడుకలు టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు భరోసా కల్పించారని పార్టీ పటిష్టతకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విజయ్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

క్రైం కార్నర్

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్వర్ణకుమారి(ఫైల్ ఫొటో)

మహిళ అదృశ్యంపై బుధవారం మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేంకు.. మండల పరిధిలోని జగన్ కాలనీలో నివాస ముంటున్న స్వర్ణకుమారి(62) ఆరోగ్యం బాగోలేదని మంత్రించుకోవాలంటూ ఇంట్లో చెప్పి సెప్టెంబర్ 29న సోమవారం స్థానికంగా ఉన్న వెంకటేష్ అనే వ్యక్తి బైక్‌లో పుంగనూరు రోడ్డులోని స్వామి వద్దకు వెళ్ళిందని చెప్పారు. తరువాత తిరిగి ఇంటికి రాలేదని, కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదని అన్నారు. ఆమె కుమారుడు నాగేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు సిఐ 9440796742 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.